## క్లుప్తంగా

### మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శ


పరామర్శిస్తున్న కొప్పుల, ఎంపీ వెంకటేశ్ నేత

వెల్గటూర్: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పానుగోటి శ్రీనివాసరావు సతీమణి మంజుల అనారోగ్యంలో హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. అలాగే ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పెద్దపెల్లి ఎంపీ వెంకటేష్ నేత కూడా ఉన్నారు.

**బీఆర్ఎస్‌లో పలువురి చేరిక**

ధర్మపురి: పట్టణానికి చెందిన కొందరు ముస్లిం నాయకులు శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ధర్మపురి మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ షబ్బీర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముస్లింలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

### ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు


ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లి: రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. పట్టణంలో ఫుట్‌పాత్‌లను శనివారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలుచోట్ల వాటిపై ఉన్న ఆక్రమణలను మున్సిపల్ సిబ్బంది చేత తొలగించారు. ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్లు పెట్టవద్దని, షెడ్లు వేయవద్దని వ్యాపారులకు సూచించారు. అలాగే దుకాణాల ముందు ఖాళీ స్థలాల్లో తోపుడు బండ్లు పెట్టుకున్న వారి నుంచి యాజమానులు అద్దె వసూలు చేస్తున్నారని, దీనిని మానుకోవాలన్నారు. ఆక్రమణలను మూడు రోజుల్లో తీసివేయాలని, లేకుంటే తామే తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది విష్ణు, ముజీబ్, నిజాం, కృష్ణ, లింబయ్య తదితరులున్నారు.

### ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు బస్ పాస్‌లు అందిస్తున్న డీఎం

పెగడపల్లి: పల్లె ప్రజలకు టీఆర్టీసీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల డిపో మేనేజర్ నర్సప్ప కోరారు. మండలంలోని శాలపల్లి గ్రామానికి శనివారం జగిత్యాల డిపో నుంచి గొల్లపల్లి మండలం అగ్గిమల్ల మీదుగా శాలపల్లికి ఆర్టీసీ బస్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ప్రైవేటు వాహనాలు ఆశ్రయించి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని గ్రామస్తులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు పంపిణీ చేశారు. బస్ సౌకర్యం ఏర్పాటును హర్షిస్తూ మేనేజర్ నర్సప్పను సర్పంచ్ తార శంకర్, గ్రామస్తులు సన్మానించారు.

### ఘనంగా పూర్వాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

మల్లాపూర్: మండలంలోని సాతారం శ్రీ పూర్వాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి పంచామృత అభిషేకం, అఖండ దీపారాధన, రక్షబంధనం, అంకురారోపణ, నిత్యహోమం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు సుమలత, ఎంపీటీసీ గున్నాల శ్రీని వాస్, ఉప సర్పంచ్ మెడకొక్కుల శ్రీనివాస్‌యాదవ్, యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాజేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అందం.. ఆరోగ్యం

సండే స్పెషల్

- అతివల చేతుల్లో చూడచక్కని డిజైన్లు
- గోరింటాకుతో చర్మవ్యాధులు దూరం
- ఆషాఢంలో ప్రత్యేక ఆకర్షణ

రాయికల్: ఆషాఢమాసం ప్రారంభమైన వేళ మహిళలు, ఆడపిల్లలు తమ చేతులపై రకరకాల గోరింటాకు డిజైన్లతో అలంకరించుకుంటారు. రుతువు మారడంతో కాళ్లు, చేతులు, గోళ్లు శుభ్రం అవుతాయని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, వ్యాధుల నుంచి దూరం చేస్తుందని ఆయుర్వేద, చర్మవైద్య నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో ఆషాఢంలో అతివలు గోరింటాకుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ గోరింటాకుతో అందంతో పాటు ఆరోగ్యం, ఆధ్యాత్మికత దాగుంది. అంతేకాకుండా ఆషాఢమాసంలో కొత్త పెళ్లికూతుళ్లు పుట్టింటికి చేరుకుంటారు. ఆ సమయంలో చేతులకు గోరింటాకు పెట్టుకుని ఎర్రగా పండింతే తమ జీవితం సౌభాగ్యంగా ఉంటుందని నమ్ముతారు. పుట్టింట ఉన్న మనసు మెట్టింట ఉన్న తన భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తుంది.


జగిత్యాలలో గోరింటాకు తయారు చేస్తున్న మహిళలు


వివిధ రకాల గోరింటాకు డిజైన్లు

### గోరింటాకుతో లాభాలెన్నో..

గోరింటాకు ఆరోగ్య సంజీవని. ఆయుర్వేద వైద్యంలో వాడతారు. దీనికి వేడిని తగ్గించే గుణం ఉంటుంది. రోగ నిరోధక శక్తిని పెంచి రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. వ్యవసాయ పనులకు వెళ్లే మహిళలకు బురదనీటితో ఎల్లప్పుడు తడిగా ఉంటాయి. అయితే ఈ కాలంలో ఈ గోరింటాకు పెట్టడంతో చర్మ వ్యాధులు సైతం దూరం అవుతాయి.

### వ్యాధులు దూరం



గోరింటాకు పెట్టుకోవడం ద్వారా స్త్రీలల్లో వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. ముఖ్యంగా రోగ నిరోధక శక్తి పెంపుదలలో దోహదపడుతుంది. కొన్ని రకాల మెహందీ కోన్లలో రసాయనాలు ఉంటాయి కాబట్టి గోరింటాకునే పెట్టుకోవాలి. – మోర రోజ, స్త్రీ వైద్య నిపుణులు జగిత్యాల

### ఫ్యాషన్‌గా మారింది



సాంప్రదాయంగా ఉన్న గోరింటాకు ఒక ఫ్యాషన్‌గా మారింది. ఆషాడమాసంతో పాటు ప్రతి శుభ కార్యానికి మహిళలు, యువతులు చేతుల నిండా గోరింటాకు పెట్టుకుంటున్నారు. అవసరమైతే బ్యూటీపార్లర్లలో గోరింటాకు పెట్టుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీలు సైతం మాట్లాడుకుంటున్నారు. – మాధురి, పీఈటీ, కోరుట్ల

### ఆరోగ్యానిస్తుంది..



పూర్వీకులు ఆచరించే సాంప్రదాయాలతోనే ఆరోగ్యంగా ఉండేది. పొలాల్లో పనులు చేసే మహిళలకు గోరింటాకు మంచి ఆరోగ్యాన్ని ఇస్తుంది. కొత్తగా పెళ్లయిన యువతులు ఆషాడంలో తల్లిగారింటికి వచ్చి గోరింటాకు పెట్టుకుని మురిసిపోవడం ఆనవాయితీగా వస్తోంది. – బొడ్ల లక్ష్మి, జగిత్యాల

### సంప్రదాయాలను గౌరవించాలి



ఈ తరం యువతులు మన సంప్రదాయాలను గౌరవించాలి. వర్షాకాలంలో ఎక్కువగా రోగాల బారిన పడతామని మన పూర్వీకులు గోరింటాకు పెట్టుకోవాలని నిర్ణయించారు. ఆ ఆచార సాంప్రదాయాలను కొనసాగించాలి. గోరింటాకుతో అందంతో పాటు ఆరోగ్యం లభిస్తుంది. – వావిలాల స్పందన, జగిత్యాల

## ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


మల్యాలలో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ముదిరాజ్ నాయకులు

మల్యాల: ముదిరాజ్ కులస్తులను అవమానపరిచేలా ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శనివారం మండల ముదిరాజ్ సంఘ నాయకులు కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ముదిరాజ్‌లను కించపరుస్తూ మాట్లాడిన కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ స్థానిక బ్లాక్ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో కౌశిక్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవిలో కొనసాగే నైతిక హక్కు లేదని, వెంటనే బీఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఈపీఏ జిల్లా ఉపాధ్యక్షుడు బొజ్జ నర్సయ్య, యూత్ అధ్యక్షుడు దొంతరవేణి శేఖర్, కోయిల శ్రీనివాస్, కొంక ముత్యం, గంగాధర రాజేశం, పిట్టల సత్యం, గడుగు రవీందర్, గణేశ్, నిమ్మ గంగాధర్, నీలం రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ముదిరాజులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలోని ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద ముదిరాజ్ కులస్తులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ముదిరాజ్ సంఘ సభ్యులు మాట్లాడుతూ ఓ వీడియో జర్నలిస్టును కిడ్నాప్ చేసి బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అజయ్ కుటుంబానికి అండగా యావత్ ముదిరాజ్ జాతి అండగా ఉందని తెలిపారు. ముదిరాజ్ జాతిని కించపరిచే విధంగా మాట్లాడిన కౌశిక్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, యూత్ సభ్యులు పిట్టల శ్రీనివాస్, పిట్టల వంశీ, గడ్డం మహేశ్, బావులు, సబ్బని రవి, అక్షయ్, నరేశ్, నేమూరి నరేందర్, పిట్టల భూమేశ్, అశోక్, బాలకృష్ణ పాల్గొన్నారు.

**కొడిమ్యాలలో..**

కొండగట్టు: మండల కేంద్రంలో మండల ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ముదిరాజ్ జాతిని అసభ్యపదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్టల శ్రీనివాస్, కాసాని గంగాధర్, కాసాని నందయ్య, కొలకాని వెంకటేష్ దొంతరవేని రవి కొలకాని సాయిబాబా కంకణాల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గెస్ట్ పీజీటీ, టీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



మల్లాపూర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో గెస్ట్ టీజీటీ పోస్టుల భర్తీకి అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎండీ.అలీమొద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ-తెలుగు, టీజీటీ-తెలుగు, టీజీటీ-హిందీ(2), పీజీటీ-బోటని, పీజీటీ-జువాలజీ, పీజీటీ-కామర్స్ సబ్జెక్టులను బోధించుటకు తాత్కాలిక ప్రతిపాదికన (అవర్లీ బేస్డ్) పనిచేయుటకు ఆసక్తి గల నిరుద్యోగులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్హతలతో పాటు టెట్ అర్హత పొందిన అభ్యర్థులు మోడల్ స్కూల్‌లో ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ 9849618625 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.


## కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేటలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ అన్నారు. ముత్యంపేటలో నిర్వహించే లయన్స్ క్లబ్ కంటి వైద్య శిబిరానికి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరుకావాలన్నారు. కంటి శస్త్ర చికిత్సలు చేయించుకునేవారు వైద్య శిబిరానికి వచ్చే వారు తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో రావాలని సంజీవ్ పేర్కొన్నారు.

**26న ఉచిత కంటి వైద్య శిబిరం**

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో ఈ నెల 26న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎలేటి చిన్నారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రేకుర్తి కంటి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి రేకుర్తిలో ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ఆపరేషన్ చేయించుకునేవారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని పేర్కొన్నారు.

## సాగులో మెలకువలు పాటిస్తేనే అధిక దిగుబడి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త రజనీదేవి

కథలాపూర్: రైతులు పంటలసాగులో మెలకువలు పాటిస్తేనే అధిక దిగుబడులు వస్తాయని పొలాస వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు అన్నారు. శనివారం మేడిపెల్లి మండలం పోరుమల్ల గ్రామంలో 'పోరుమల్ల మామిడి ఉత్పత్తిదారుల సంస్థ' సర్వసభ్య సమావేశం జరిగింది. శాస్త్రవేత్తలు మామిడి, వరి పంటలసాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. వరి రైతులు విత్తనశుద్ధి చేసి నారు పోస్తే పంటలకు రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రజనీదేవి, లక్ష్మిప్రసన్న, స్వాతి, సర్పంచ్ తొటి తిరుపతిరెడ్డి, ఎఫ్‌పీసీ చైర్మన్ కొంగరి సంజీవ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్, ఏవో త్రివేదిక, రైతులు పాల్గొన్నారు.

## బీసీల ఆర్థికసాయం దరఖాస్తులు పరిశీలించాలి

కథలాపూర్: బీసీలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం దరఖాస్తులను గ్రామాల్లో కార్యదర్శులు పరిశీలించాలని ఎంపీడీవో జనార్ధన్ అన్నారు. శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 701 మంది బీసీలు ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. దరఖాస్తులో నమోదు చేసిన సర్టిఫికెట్లు పరిశీలించి నివేదిక తయారు చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు.

## ఘనంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తులు

కోరుట్ల: పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులోని పెద్దమ్మ తల్లి ఆలయ 13వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్, నాయకులు పీసరి నర్సయ్య, బండారి వెంకటి, రాసరి రాజశేఖర్, కలాల సాయి చంద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చిత్రకథ



### ప్రమాదకరంగా గుంతలు

బుగ్గారం: జాతీయ రహదారి నుంచి బుగ్గారం మండల కేంద్రానికి వెళ్లే రహదారిపై పలు చోట్ల ఏర్పడిన గుంతలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. సుమారు రెండు కిలోమీటర్లకు వరకు గల ఈ రహదారి బాగా దెబ్బతినడంతో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో పలు వాహన ప్రమాదాలు సైతం జరిగాయి. ముఖ్యంగా రాత్రిపూట ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు బిక్కుబిక్కు మంటూ వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇకనైనా అధికారులు తక్షణమే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## బీసీ కులాలన్నింటికీ రూ.లక్ష సాయం అందించాలి


వినతిపత్రం ఇస్తున్న సాయికుమార్

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.1లక్ష సాయాన్ని అన్ని బీసీ కులాలకు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుందారపు సాయికుమార్ అన్నారు. శనివారం తహసీల్దార్ రవీందర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఎన్నికల కోసమే బీసీ కులాలకు రూ.1లక్ష సాయం ప్రకటించాడన్నారు. ఆ సాయంలో కూడా షరతులు పెట్టి కొన్ని కులాలకే అంటూ జీవో విడుదల చేసి 80 శాతం బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కుట్రలను ప్రజలు, యువత గమనిస్తున్నారని, సరైన సమయంలో బీఆర్ఎస్‌కు, సీఎం కేసీఆర్‌కు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం లక్ష సాయాన్ని బీసీ కులాలన్నింటికీ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలి రేట్లు పెంచాలి


కూలీలతో మాట్లాడుతున్న మంద రవీందర్

మల్యాల: ఉపాధి హామీ కూలి గిట్టుబాటు కావడం లేదని, రేట్లు పెంచాలని బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవీందర్ డిమాండ్ చేశారు. మల్యాల మండలం బల్వంతాపూర్‌లో ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. ఉపాధి హామీ పనుల కోసం కిలోమీటర్ల కొద్ది నడిచివెళ్లాల్సి వస్తోందని, కూలి గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, పని ప్రదేశాల్లో కనీసం మౌలిక వసతులు కల్పించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం సైతం కూలీలకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ మండలాధ్యక్షుడు మునుగూరి నివాస్, మ్యాక రూపేశ్, విఘ్నేష్, నక్క అనిల్, మల్లేశ్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ**

రాయికల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, డీసీలు బత్తిని భూమయ్య, మ్యాకల రమేశ్, అధ్యక్షుడు ఎద్దండి దివాకర్‌రెడ్డి, కొమ్ముల ఆదిరెడ్డి, కడకుంట్ల నరేశ్, మోసారపు శ్రీకాంత్, గంట్యాల ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పాఠశాలకు ట్యూబ్ లైట్లు వితరణ**

వెల్గటూర్: మండల కేంద్రానికి చెందిన వెలగందుల సంతోశ్ తన తండ్రి జ్ఞాపకార్థం కేజీబీవీ పాఠశాలకు రూ.5 వేల విలువ గల 10 ట్యూబ్‌లైట్లు వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు పలువురు సంతోష్‌ను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు మురళిగౌడ్, ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి, గుంత సంతోష్, కస్తూరి హరి, కొత్త దినేష్, పందిరి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రైవేట్ పాఠశాలలయాజమాన్య కమిటీ ఎన్నిక**

కథలాపూర్: మేడిపెల్లి మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా పల్లికొండ గణేశ్, ఉపాధ్యక్షుడిగా తొగిటి జగదీశ్వర్, ప్రధానకార్యదర్శిగా బడె ఎడ్వార్డ్ జోయెల్, కోశాధికారిగా దాసరి పరంధాం, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సంజీవ్, కార్యవర్గసభ్యులుగా ఎ. దయాకర్, కె. మహేందర్ ఎన్నికయ్యారు.

**బీర్‌పూర్ విద్యార్థికి నవోదయలో సీటు**

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన సైండ్ల రక్షిత్‌కు నవోదయలో సీటు సాధించాడు. రక్షిత్ స్థానిక సూర్య పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

## వృథాగా పాఠశాలల భవనాలు



రామభద్రునిపల్లి, ఉప్పపల్లెలో మూతపడ్డ పాఠశాల భవనాలు



పెగడపల్లి: గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాలల భవనాలు వృథాగా పోతున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంగా ఉప్పపల్లె, రామభద్రునిపల్లి, కొండాయపల్లి, అయ్యవారిపల్లె ప్రాథమిక పాఠశాలలను ఏళ్ల క్రితం మూసివేశారు. ఈ భవనాలు వాడకంలో లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. నిరుపయోగంగా ఉంటున్న పాఠశాల భవనాలను వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కృషి చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. భవనాలు ఏదో రకంగా వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించి భవనాలను పరిరక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.